www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 18 జులై 2023

దూరవిద్యలో పదవ తరగతి ప్రవేశాలు

నవతెలంగాణ-దండేపల్లి

2023-24 సంవత్సరానికి దూరవిద్య విధానంలో చదువుకునేందుకు ప్రవేశాల కొరకు ఆసక్తిగల అభ్యర్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఓపెన్ స్కూల్ సమన్వయకర్త సంఘర్ష్ రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 10 చివరి తేదీ అని, గడువులోపు ప్రవేశ రుసుమును దగ్గరలోని మీసేవా కేంద్రాలలో చెల్లించి రశీదుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పాఠశాలలో అందజేయాలని పేర్కొన్నారు. వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8309769067 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి మలుపు వద్ద ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జుమిడి విమల చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సీతానగర్ గ్రామానికి చెందిన తల్లి కుమారులు విమల, నితిన్‌లు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విషయం తెల్సిందే. వీరిని హైద్రాబాద్‌లో గాంధీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు అందించగా ఆదివారం కుమారుడు నితిన్ మృతి చెందాడు. సోమవారం తల్లి విమల కూడా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛ్ఛాయలు అలుముకున్నాయి.

జలవిలయం మళ్లీ తప్పదా..?

- ఏడాది క్రితం జిల్లాను అతలాకుతలం చేసిన వరదలు
- ముంపు వాసులను వెంటాడుతున్న భయం
- ఏడాది విలయానికి నేటికీ అందని పరిహారం
- ముందస్తు చర్యలు శూన్యం

ఏడాది క్రితం జిల్లాలో అతివృష్టి నెలకొంది. జులై 12 నుండి 20 వరకు వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు జిల్లా అతలాకుతలమైంది. చెరువులు మత్తడి దూకాయి. వాగులు, ఒర్రెలు పొంగి పొర్లాయి. వరద తాకిడికి రవాణా వ్యవస్థ స్తంభించి పోయింది. జనజీవనం అతలాకుతలమైంది. ఇది జరిగి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం బాధితులకు నేటికీ పరిహారం ఇవ్వకపోగా వరదలు పురావృతమైతే తీసుకోవాల్సిన చర్యలను కూడా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



మతాశిశు కేంద్రం చుట్టూ చేరిన వరద నీరు(ఫైల్)

నవతెలంగాణ - హాజీపూర్

గతేడాది జులై నెలలో అధిక వర్షాలకు జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు నీటమునిగాయి. రాంనగర్, ఎల్ఐసి కాలనీ, ఎన్టీఆర్ నగర్, పద్మశాలివాడ, పాత మంచిర్యాల, హమాలివాడ, గోపాల్‌వాడ, రాళ్లపేట్‌లో ఎక్కువ సంఖ్యలో ఇండ్లు నీట మునిగాయి. జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న హాజీపూర్ మండలంలోని వేంపల్లికి వరద పోటు తప్పలేదు. ఊహించని విధంగా వరద గ్రామాన్ని ముంచెత్తింది. గోదావరి పరివాహక మండలాలైన దండేపల్లి, నస్పూర్, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లిలో పలు గ్రామాలు నీట మునిగాయి. అప్పటి కలెక్టర్ భారతి హోళికేరి మారుమూల మండలం వేమనపల్లికి వెళ్లి మరీ సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితులకు ధైర్యం చెప్పారు.

మునిగిన మాతాశిశు కేంద్రం

జిల్లా కేంద్రంలోని మాతాశిశుగోదావరి వరద ఉధృతికి పూర్తిగా మునిగిపోయింది. మూడు ఫ్లోర్‌ల బిల్డింగ్‌లో బోర్డ్ మాత్రమే కనబడింది. సుమారు మూడు కోట్ల విలువ చేసే సామాగ్రి, ఫర్నీచర్ నీటిలో తడిసిపోయింది. ప్రతిపక్ష, ప్రజాసంఘాల నాయకులు హుటాహుటిన ఆరోగ్య కేంద్రంలోని బాలింతలను, పిల్లలను ఏరియా ఆస్పత్రికి తరలించడంతో ముప్పు తప్పింది. 5నెలల అనంతరం దాన్ని మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చారు. అయినా ఇప్పుడు భారీ వర్షాలు కురిస్తే మళ్లీ మునిగిపోయే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. కాలేజి రోడ్డులోని శ్మశాన వాటిక ఆనవాళ్లు కూడా కనబడ లేదు. పద్మనాయక ఫంక్షన్ హాల్ వెనుకాల ఇల్లు పూర్తిగా గోదావరి వరదలో మునిగిపోయింది. ఇంట్లో ఉన్న వ్యక్తి కాపాడాలంటూ కేకలు వేయడంతో స్థానికులు కాపాడారు. రాళ్ల వాగు పొంగి పొర్లింది. వాగును ఆనుకొని నిర్మించిన గోడలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి.

జిల్లా కేంద్రానికి రాకపోకలు బంద్

అధిక వర్షాలతో గత జులైలో ఎల్లంపల్లి 50గేట్లు ఎత్తడంతో వేంపల్లి మేకల మండి ముల్కల్ల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై పూర్తిగా వరద నీరు చేరడంతో 24గంటల పాటు రహదారిపై రాకపోకలు బంద్ అయ్యాయి. పోలీసులు ఎక్కడి వాహనాలను అక్కడే ఆపేశారు. జిల్లా మొత్తంగా ఒక కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. రాకపోకలు నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది.

ఇప్పుడు అధిక వర్షాలు పడితే?

గతేడాది ముంపు గాయాలు మానక ముందే మళ్లీ ఇప్పుడు వర్షాలు పడితే ఎలా అంటూ ముంపు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నాయకుల హామీలు ఇప్పటికీ అమలు కాలేదు. నష్టపోయిన వారికి ఇప్పటికీ పరిహారం అందనేలేదు. నీట మునిగి నష్టపోయిన ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు పది వేల గృహాలు నీట మునిగితే అందులో అధికారులు 3వేలే అని లెక్కలేశారు. వాటికి కూడా ఇంకా పరిహారం అందలేదు. ఇప్పటికే కాళేశ్వరం నీటిని ఎల్లంపల్లిలో ఎత్తి పోస్తుండడంతో 15టీఎంసీల నీరు నిల్వ ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం తుఫాను ప్రభావంతో వర్షాలు కురిస్తే ఎల్లంపల్లి పూర్తిగా నిండి గేట్లు ఎత్తెస్తే మళ్లీ మంచిర్యాలకు ముంపు తప్పదని పలువురు హెచ్చరిస్తున్నాయి. గత జలవిలయం నుండి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదని పట్టణవాసులు విమర్శిస్తున్నారు.



వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పడవలో పర్యటిస్తున్న అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యే బాల్క సుమన్(ఫైల్)

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావుతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇతర విద్యాసంస్థల్లో అనుసరిస్తున్న సమయసారిణి గురుకులాల్లో కూడా అమలుపరచాలన్నారు. శ్రమకు తగిన వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులపై పనిభారం, మానసిక ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయినిలకు రాత్రిపూట డ్యూటీల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సీఆర్టిలను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్ టైం, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పే 12 నెలలు అమలు చేయాలని, రెగ్యులర్ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం పండుగల సమయంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వీక్ ఆఫ్ ఇవ్వాలన్నారు. అన్ని సొసైటీలో ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు మంజూరు చేయాలన్నారు. గురుకులల్లో బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్ షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులల్లో సమస్యలు పరిష్కరించకుంటే దశల వారి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండలాధ్యక్షులు సింగతి ఉపేందర్, సత్యనారాయణ, హేమంత్ షిండే, తంగడిపల్లి రమేష్, కోట తిరుపతి, చంద్రయ్య, శంకర్, లలిత, హేమలత, స్వప్న, భాగ్యలక్ష్మి, మాన్కు, వెంకటేష్, మారుతి, మహేష్ వివిధ గురుకులాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం (సీఆర్‌టి) ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత 20 ఏళ్లుగా తాము మారుమూల గిరిజన ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 1804 మంది ఉన్నట్లు ఎమ్మెల్సీకి వివరించారు. తమకు ఉద్యోగ భద్రత లేదని, రెగ్యులర్ చేయాలని కోరారు. కనీస వేతనం కల్పించాలని, 61 ఏళ్ల వరకు వయోపరిమితి పెంచాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అధ్యక్షులు కొమరెల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి జరుప్పల విజేష్, సభ్యులు ప్రవీణ్ పాల్గొన్నారు.

హాజీపూర్ : గురుకుల విద్యా సంస్థల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తా వద్ద నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గురుకులాలు ఏర్పాటు చేసి ఆరేళ్ల గడిచినా సొంత భవనాలు నిర్మించలేదని, ఉపాధ్యాయులను తగినంత నియమించలేదనీ పేర్కొన్నారు. ఉన్న ఉపాధ్యాయులపై అధిక భారం పడుతున్న నేపథ్యంలో బోధనేతర పనులతో మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని సొసైటీలలో ఏకరూప పాలన అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ప్రిన్సిపాళ్లకు 100శాతం, జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులలో 70శాతం పదోన్నతులు ఇన్ సర్వీస్ వారికి ఇవ్వాలని కోరారు. సీఆర్టీలను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు ఆగచారి, జిల్లా కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు కె.చంద్రమౌళి, వి.కిరణ్ కుమార్, సంతోష్ కుమార్, ఎండీ అయూబ్‌ఖాన్, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి, రమేష్, బారిక్‌రావు, శ్రీనివాసరెడ్డి, దుర్గయ్య, పోచన్న, లలిత, మంజుల, శ్యామ్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో..



హాజీపూర్: మంచిర్యాలలో..

సేఫ్టీ కమిటీ సమావేశాన్ని అడ్డుకున్న జాతీయ సంఘాల నాయకులు



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని సోమవారం జాతీయ సంఘాలైన ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఫిట్ కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. ఏరియా వర్క్‌షాప్ డీజీఎం నాగభూషణ్‌రావును కలిసి తమను కూడా సమావేశానికి ఆహ్వానించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేష శైనారావు మాట్లాడుతూ డైరెక్టర్ ప్రాజెక్ట్ బలరాంకు ప్రత్యేక ప్రకటన ద్వారా జాతీయ సంఘాలను కూడా అన్ని సమావేశాల్లో పాల్గొనడానికి ఆహ్వానించాలని తెలిపారు. గుర్తింపు సంఘమైన టీబీజీకేయస్ కాలపరిమితి రెండు సంవత్సరాలకు బదులు నాలుగు సంవత్సరాలు అదనంగా అయిందన్నారు. కోర్టు ద్వారా ఎన్నికల పొడగింపు చేసుకుంటూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఒక్కరే సమావేశంలో ఉండాలని కోరుకోవడం హాస్యాస్పదమని తెలిపారు. సమావేశంలో ఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, ఫిట్ కార్యదర్శి కొడం అశోక్, సహాయ కార్యదర్శి నాగరాజు, హెచ్ఎంఎస్ ఫిట్ కార్యదర్శి వసీమ్, హెచ్ఎంఎస్ నాయకులు రమేష్, శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ ఫిట్ కార్యదర్శి కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎరియల్స్, బోనస్ దసరాకు ముందే చెల్లించాలి

నవతెలంగాణ-మందమర్రి

11వ వేజ్‌బోర్డు ఎరియర్స్, దీపావళి బోనస్ అడ్వాన్స్‌లు దసరాకు ముందే చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. మందమర్రి ఏరియా కెకె-5 గనిపై సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా 35శాతం చెల్లించాలన్నారు. సింగరేణి సంస్థకు వివిధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన 29వేల కోట్ల బకాయిలను వసూలు చేయాలన్నారు. కంపెనీ డబ్బులు వసూలు చేయకుండా వివిధ బ్యాంకుల చుట్టూ అప్పులకు తిరిగి అధిక వడ్డీలు చెల్లించడం వల్ల కార్మికులపై భారం పడుతుందన్నారు. వెంటనే బకాయిలు వసూలు చేసి కార్మికులపై భారం పడకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీలు సోంశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్, ఏరియా సెక్రటరీ జెట్టి మల్లయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు టేకుమట్ల తిరుపతి, గాండ్ల సంపత్, జువ్వాజి శ్రీనివాస్, అలి, సంతు, రాములు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-దండేపల్లి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలలో ఒకటి కూడా నెరవేర్చలేదని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆరోపించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు గతంలో సమ్మె చేసినప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేస్తూ జీవనం సాగించే వారికి వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టి మళ్లీ మోసం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీటీసీలు, సర్పంచులు, మండల నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ఉన్న సెంట్రల్ నర్సరీ రోడ్డు ఇరువైపులా డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి వెంకటేశ్వరరెడ్డి, జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సింగరేణి ఉన్న అన్ని ప్రాంతాలలో మొక్కలు నాటడం జరుగుతుందని, వాటిని పరిరక్షించడానికి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ వంతు బాధ్యతను నిర్వహిస్తుందని, మానవాళి మనుగడకు మొక్కలు చాలా అవసరమని దీన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకొని తమవంతుగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జిఎం రఘు కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం శ్రీనివాస్, వి పురుషోత్తమరెడ్డి, ఏజిఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీఎంలు అరవిందరావు, శివరావు, రాజేశ్వర్, ఫారెస్ట్ ఆఫీసర్ రమణరెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఎస్ఈ పర్వేజ్ చంద్రశేఖర్, వివిధ గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

గనిపై రక్షణ అవగాహన సమావేశం

కాసిపేట : కాసిపేట గనిపై సోమవారం రక్షణ అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోవాలని తెలియజేస్తూ నా రక్షణ నాదే బాధ్యత నుండి నా రక్షణ నా కుటుంబ బాధ్యతగా మనకు మనమే స్వతహాగా రక్షణ పొందాలని జనరల్ మేనేజర్ (సేఫ్టీ) బెల్లంపల్లి రీజనల్ గుప్తా అన్నారు. రక్షణ అవగాహన సమావేశంలో కుటుంబ యజమాని ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా ఉంటుందని, అప్పుడే సంస్థ బాగుంటుందని తెలిపారు. ప్రతి ఒక్క వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే సంస్థ బాగుంటుందని, అవగాహనతో ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. సేఫ్టీపై అవగాహన కలిగి శిక్షణ పొంది ఉండేందుకు సింగరేణి యాజమాన్యం శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తుందని సింటాస్ అధికారి శర్మ అన్నారు. ఉత్పత్తితో పాటు రక్షణ నియమాలను పాటించి బొగ్గు ఉత్పత్తి తీసుకురావాలని ఉద్యోగులను కోరారు. కార్యక్రమంలో మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణ అధికారి సునీల్‌కుమార్, టిబిజికెఎస్, ఎఐటియుసి పిట్ సెక్రటరీ బైరి శంకర్, మీనుగు లక్ష్మినారాయణ, ఇంజనీర్లు బాబు, మధుకర్, డిప్యూటీ మేనేజర్లు నిఖిల్, వెంకటేష్, దిలీప్, సర్వేయర్ వేకటేశ్వర్లు, ఖాన్ పాల్గొన్నారు.

సేఫ్టీ జీఎంకు సన్మానం

నూతనంగా సేఫ్టీ జనరల్ మేనేజర్ బెల్లంపల్లి రీజినల్‌గా బాధ్యతలు స్వీకరించిన గుప్తను అధికారులు అల్లావుద్దీన్, శర్మ, సునీల్, నిఖిల్, బాబు, మధుకర్, దిలీప్, వెంకటేష్ శాలువాతో సన్మానించారు. అనంతరం టిబిజికెఎస్ ఒడ్నాల రాజన్న, బైరి శంకర్, ఏఐటీయూసీ లక్ష్మీ నారాయణ, రాజేందర్ నాయకులు శాలువాతో సన్మానించారు.

కోనప్ప అసమర్థతకు అందవెల్లి వంతెనే నిదర్శనం

- డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అసమర్థతకు అందవెల్లి వంతెనే నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్-దహెగాం ప్రధాన రహదారిపై అందవెల్లి గ్రామ సమీపంలో పెద్దవాగుపై గతేడాది వంతెన కూలిపోయిన విషయం తెల్సిందే. దీనితో 54 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనిని నిరసిస్తూ సోమవారం వంతెన వద్ద హరీష్‌బాబు దీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అజ్మీరా ఆత్మారాం నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వంతెన కుంగితే అప్పుడే మరమ్మత్తులు చేపట్టాల్సి ఉండగా, జాప్యం చేయడంతో రెండేళ్లుగా ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఇసుక మాఫియా కారణంగానే వంతెన త్వరగా కూలిందని విమర్శించారు. గత 15 ఏళ్ల కాలంలో నియోజకవర్గం ఏ మాత్రం అభివృద్ధి చెందకుండా పురోగమన దిశలో పయనించిందని అన్నారు. కాగజ్‌నగర్ నుండి దహెగాం మండలం రాంపూర్, మొట్లగూడ వరకు రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉందని అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని విమర్శించారు. అయినా ఎమ్మెల్యేకు చీమకుట్టినట్లయినా లేకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, దహెగాం మండల అధ్యక్షులు రాపర్తి ధనుంజయ్, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ కొంద్ర ప్రభాకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోలెం వెంకటేష్, నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, ఉమ్మెర బాలకృష్ణ, దోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు అధికారమే ముఖ్యం

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు

నవతెలంగాణ - హాజీపూర్

బీఆర్ఎస్ నాయకులకు అధికారమే ముఖ్యం కాని ప్రజాసంక్షేమంపై శ్రద్ధ లేదని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు విమర్శించారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం ఎమ్మెల్యే కొడుకు దండేపల్లి మండలం కాసిపేట్‌లో ప్రచారం చేస్తున్న క్రమంలో రైతు జంగిలి ముత్తయ్య తనకు 47 ధాన్యం బస్తాలు కోత విధించారని తెలుపగా అక్కడే ఉన్న బీఆర్ఎస్ వార్డ్ సభ్యుడు కోడి రాజేష్ రైతు దాడి చేసి తీవ్రంగా గాయపరిచడం ఆటవిక చర్య అని అన్నారు. రైతు గాయపడినా ఎమ్మెల్యే తనయుడు అక్కడి నుండి వెళ్లి పక్క ఇంట్లో ప్రచారం చేయడంపై మండి పడ్డారు. తనను గుండాగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గ్రూప్ వారే ప్రత్యక్ష గుండాయిజానికి దిగడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. గాయపడ్డ రైతుకు కాంగ్రెస్ వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. జిల్లాలో ఇంకా చాలా మంది రైతులకు ధాన్యం డబ్బులు రాలేదన్నారు. కాంగ్రెస్ రైతు పక్షపాతి అని, రాబోవు రోజుల్లో అధికారంలోకి వచ్చి రైతుల సమస్యలు తీరుస్తామని తెలిపారు. ఓ పక్క రైతుబంధు ఇస్తూనే అంతకు మించి రైతుకు నష్టం చేస్తున్నారని తెలిపారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న పుకార్లు బీఆర్ఎస్ సృష్టే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ సురేఖ, టీపీసీసీ అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుదారి తిరుపతి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఒడ్డే రాజమౌళి, హేమలత, టౌన్ ప్రెసిడెంట్ తూముల నరేష్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని భూగర్భ, ఉపరితల గనులలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సాధించిన బొగ్గు, ఓబి ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్షించి, సాధించవలసిన ఉత్పత్తి లక్ష్యాలు, భూగర్భంలో ఖర్చులను తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతపై సోమవారం డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి సిసిసి గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న అన్ని భూగర్భ గనులు తమ ఉత్పత్తి వ్యయలను తగ్గించుకొని లాభాలను సాధించడానికి తగిన ప్రణాళికలు వేసుకొని ముందుకు వెళ్లాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలని అన్నారు. రోజువారి ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ, బొగ్గు రవాణాను చేయాలని, అలాగే ఆయా గనుల పురోగతిని, ఆయా గనులకు కావలసిన యంత్రాలు, యంత్ర సామాగ్రిపై ఆయా గనుల ఏజెంట్లు, మేనేజర్లతో ప్రత్యేకంగా చర్చించారు. రక్షణే ప్రథమం రక్షణే ఎల్లప్పుడూ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జిఎం రఘు కుమార్, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ వి పురుషోత్తమరెడ్డి, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా స్టోర్స్ డీజీఎం యాదయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, డీజీఎం ఐఈడి కె చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఎస్ఈ పర్వేజ్ చంద్రశేఖర్, అన్ని గనుల మేనేజర్లు, అన్ని గనుల గ్రూప్ ఇంజనీర్లు, అన్ని గనుల సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 20న జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లా ఒలంపిక్ డ్యాన్స్, స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆగష్టు 20న జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోషియేషన్ నాయకులు తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్‌లో అసోషియేషన్ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. సీనియర్ డ్యాన్సర్, యాక్టర్ మారం అమరావతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం తెలంగాణ ఒలంపిక్ డ్యాన్స్, స్పోర్ట్స్ అసోషియేషన్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రం, బహుమతులతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. డ్యాన్స్ మాస్టర్లు, విద్యాధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వచ్ఛంద సేవల నిర్వాహకులు ఈ పోటీల విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ డోంగ్రి సంతోష్‌కుమార్, అసోషియేషన్ ఉపాధ్యక్షులు బూడిద గోపాలకృష్ణ, గౌరవ సలహాదారులు కోట వెంకన్న, గజ్జల నాగేశ్వర్‌రావుతో పాటు చిప్పకుర్తి దేవదాసు, మేడి కార్తీక్, శ్వేత, రాజేష్, రాజశేఖర్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 18 జులై 2023

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు రూ.5వేల అందజేత



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో అన్నాభావు సాటే యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు రూ.5వేల నగదును సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలతో వ్యక్తుల మధ్య సోదరభావం పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సుభాష్, పీసా కమిటీ చైర్మన్ సికిందర్ రాథోడ్, హరిచంద్, ప్రకాష్, మహేందర్, రాజు, శివదాస్, కిషోర్, సాయి, రవి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-బేల

మండలంలోని భవానిగూడ గ్రామానికి చెందిన టేకం అయ్యా పారిశుధ్య కార్మికుడు ఐదు నెలల కింద రోడ్డు ప్రమాదం జరగడంతో నడవలేని పరిస్థితి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి నెలకు సరిపడ రూ.5వేల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట మండల నాయకులు మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఘనశ్యామ్, భోక్రే శంకర్, విపిన్ ఠాక్రె, సుమిత్, అఖిల్, గోడే అవినాష్, ధైర్యవాన్, గ్రామ ఉపసర్పంచ్ పోతారాజు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో రైతుల అభ్యున్నతికి కృషి



నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ పాలనలో రైతుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ క్లస్టర్ పరిధిలోని రైతులతో రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ హయాంలో రైతు రాజ్యమేలుతున్న తరుణంలో కడుపు నిండా విషం కక్కుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని దిక్కుమాలిన మాటలు మాట్లాడటం సిగ్గుచేటని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతు బీమా లాంటి అద్భుతమైన పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో రైతులు అష్ట కష్టాలు లాఠీ దెబ్బలు సైతం తిన్నారని అన్నారు. రైతులు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

టీఏజీఏస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 21 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయాలనీ ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బైరి సోమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఏజీఎస్ కార్యాలయంలో క్లాసులకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఆదివాసీ చట్టాలు, అమలు, భారత రాజ్యాంగం, ఆదివాసీ పోరాటాలు, గిరిజన అభివృద్ధి, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఆదివాసీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు ఆత్రం కిష్టన్న, కుంరం దీపక్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని దుబ్బగూడ గ్రామస్తులు పటేల్ ఆడ హన్మంత్‌రావ్, సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ సోయం బాపురావుకు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని అందజేశారు. దుబ్బగూడ గ్రామానికి ప్రధాన రహదారి శంకర్‌గూడ నుంచి సుమారు 2 కి.మీ. మేర దూరంలో ఉందని తమకు రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో బురదలో నడువాల్సిన పరిస్థితి ఉందని విన్నవించారు. నిత్యావసర సరుకులు తేవాలన్నా, అత్యవసర వైద్యం కోసం వెళ్లాలన్న ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని అన్నారు. రోడ్డు సౌకర్యం కల్పించుటకు ఎంపీ సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉపసర్పంచ్ సుధీర్, గ్రామస్తులు మెస్రం ఆనంద్‌రావు, మెస్రం సుదర్శన్, ఆడ మాణిక్‌రావు ఉన్నారు.

20న సిడాం శంభు 5వ వర్ధంతిని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

తుడుందెబ్బ వ్యవస్థాపకుడు, ఆదివాసుల హక్కులపై పోరాటాలు చేసి అశువులు బాసిన సిడాం శంభు 5వ వర్ధంతికి సంఘాల అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని సిడాం శంభు తనయుడు సిడాం సోనేరావ్, ఆదివాసీ సంఘాల నాయకులు పెందుర్ పుష్పరాణి, పుర్క బాపురావు అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో పోరాటాలు చేసిన కుమురం భీం ఉద్యమ స్ఫూర్తితో సిడాం శంభు ఉద్యమాలను కొనసాగించారని అన్నారు. ఆదివాసులు ఎదుర్కొంటున్నా సమస్యలు పరిష్కరించాలని, ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత సిడాం శంభుకే దక్కుతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈనెల 20న మండలంలోని మత్తడిగూడలో నిర్వహించే 5వ వర్ధంతి సభకు అధిక సంఖ్యలో ఆదివాసులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కనుసన్నల్లో నకిలీ విత్తనాల దందా

- ఒక శాతం కుటుంబాల చేతిలోనే తెలంగాణ సంపద
- పోడు భూముల పంపిణీలో అవకతవకలు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-ఇచ్చోడ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే నకిలీ విత్తనాల దందా నడుస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో షార్ప్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బహుజన ఆత్మగౌరవ సభకు హజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తూ, పేద రైతులను నిలువునా ముంచుతున్నారని, ఆంధ్ర ప్రాంతం నుంచి నకిలీ విత్తనాలు తెచ్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమ్ముతున్నారని అన్నారు. ఈ దందాకు సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కారకులని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేకపోవడం వల్ల బ్యాంకులు వారి అకౌంట్లను హోల్డ్‌లో పెడుతున్నారని, రైతుబంధు డబ్బులు వస్తే బ్యాంకులు రైతులకు ఇవ్వకుండా ఆపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. హైదరాబాద్ నగరంలోని వందల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం రహస్య జీఓల ద్వారా బీఆర్ఎస్ నాయకులకు అక్రమంగా కట్టబెడుతుందని ఆయన ఆరోపించారు. అందుకోసమే ప్రభుత్వం జీఓ నెం.59 తీసుకొచ్చిందని అన్నారు. కానీ బహుజన రాజ్యంలో ఆ భూములన్నీ స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు పంచుతామన్నారు. తెలంగాణ ఆస్తులు కేసీఆర్, కేటీఆర్‌ల అయ్య సొత్తు కాదన్నారు. తెలంగాణలో సంపదంతా ఒక్క శాతం ఉన్న కుటుంబాల దగ్గరే ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోడు పట్టాల పంపిణీలో పూర్తిగా అవినీతి జరిగిందని ఆరోపించారు. అనర్హులకు, స్థానిక ఎమ్మెల్యేల అనుచరులకు కూడా అక్రమంగా పోడు పట్టాలు ఇచ్చినట్లుగా అనుమానాలున్నాయని అన్నారు. ఆరు లక్షల మందికి పోడు పట్టాలకు దరఖాస్తు చేసుకుంటే కేవలం 1.2 లక్షల మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారని ఆయన





విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని బీసీలు, ఎస్సీలకు కూడా పోడు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోడ్లు కూడా వేయించడం లేదన్నారు. ప్రయాణికులు వాగుల్లో కొట్టుకపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మినరల్ ఫండ్స్ సిద్ధిపేట, గజ్వేల్‌కు తరలించారని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాను కావాలని పాలకులు వెనక్కి నెట్టివేశారని ఆయన పేర్కొన్నారు. సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి ఆదిలాబాద్ జిల్లాకు ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సమగ్ర శిక్షలో పని చేస్తున్న టీచర్లను వారి అర్హత ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 52 శాతం బీసీలు ఉంటే రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం ఆరు వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. బీసీలకు రాబోయే ఎన్నికల్లో 60 సీట్లు ఇచ్చే ఏకైక పార్టీ బీఎస్పీ అన్నారు. దమ్ముంటే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు ఎన్ని సీట్లు ఇస్తాయో ప్రకటించాలని సవాల్ విసిరారు. ఇతర పార్టీలతో బీసీలకు న్యాయం జరగదన్నారు. అందుకే అన్ని పార్టీలలోని బీసీలు బీఎస్పీలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం బీసీలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ లక్ష సాయం ఎందుకు అందించడం లేదన్నారు. దళితబంధు, గిరిజనబంధు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, ఇక్కడ ప్రత్యేక కోర్టును కూడా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేవలం పేరుకే ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నాయని, ఆధిపత్యం మాత్రం దొరలదే కొనసాగుతుందన్నారు. ఈ పరిస్థితి పోవాలంటే మన రాజ్యం రావాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీడం గణపతి, జిల్లా అధ్యక్షులు గడుగు మహేందర్, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి నాయకులు రత్నపురం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మికాంత్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్, జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి జంగుబాపు, మహిళా నాయకురాలు అర్చన, ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌ఛార్జి మెస్రం మీనా, ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి సోయం చెన్నయ్య, ఖానాపూర్ ఇన్‌ఛార్జి బన్సీలాల్ రాథోడ్, సీనియర్ నాయకులు మేకల మల్లన్న పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-జైనథ్

అన్నదాతలు బాగుపడితే చూడలేని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు త్వరలోనే మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని సిర్సన్న, గిమ్మ గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్గొని, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలో అన్నదాతలు అనేక ఇబ్బందులకు గురయ్యారని, వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం బృహత్ పథకాలను అమలు చేసిందని అన్నారు. రైతులకు మూడు గంటల విద్యుత్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ విధానాలకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలను గుర్తుకు తెచ్చేలా రేవంత్ చేసిన వ్యాఖ్యలను వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పడానికి సైతం ఆయన ఒప్పుకోకపోవడం అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ బోజారెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, రైతుబంధు అధ్యక్షులు లింగారెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రేపు కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు యాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ పేరుతో మోసం చేస్తుందని ప్రభుత్వ తీరును ఎండగడుతూ టీపీసీసీ పిలుపుమేరకు మావల గ్రామంలో ఈనెల 19న రైతులకు అండగా ఉండేందుకు రైతు యాత్ర పేరుతో సభను నిర్వహిస్తున్నట్టు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ హామీ ఇచ్చి గత ఐదు సంవత్సరాలు గడుస్తున్న రైతులకు లక్షరూపాయల రుణమాఫీ నెరవేర్చడం లేదన్నారు. అదేవిధంగా రైతులకు 24 గంటల కరెంటు పేరుతో మోసం చేయడమే కాకుండా దీనిపై ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని అన్నారు. రైతులకు ప్రజలకు ఎన్నో హామీలతో మోసం చేస్తున్న కేసీఆర్ పాలనపై ముఖ్యంగా అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు రైతు యాత్ర పేరుతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రైతు సోదరులందరూ పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని అన్నారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్ కొండ గంగాధర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ మల్లయ్య ఉన్నారు.

మున్నూరు కాపు సత్రానికి విరాళాల సేకరణ

నవతెలంగాణ-దిలావర్‌పూర్

బాసరలో నిర్మిస్తున్న మున్నూరు కాపు అన్నదాన సత్ర నిర్మాణానికి విరాళాల సేకరణకు దాతలు సహకరించాలని ముధోల్ తాలుక మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రోల రమేష్ పేర్కొన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నూరు కాపు సత్రానికి తమవంతు సహకారం అందిస్తామని ఎంపీపీ పాల్దె అక్షర అనిల్ అన్నారు. మున్నూరు కాపు సంఘాల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేసి అన్ని మున్నూరు కాపు సంఘాలు సత్రం నిర్మాణానికి సంఘం నుంచి కూడా సహాయ సహకారాలు అందజేసేందుకు తమ వంతుగా విరాళాలు సేకరించి అందజేస్తామని హామీ ఇచ్చారు. బాసరలో మున్నూరు కాపుల సత్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంటాల మండల సంఘం అధ్యక్షుడు గోవిందరాజ్, లోకేశ్వరం సంఘం అధ్యక్షుడు ముంద లింగన్న, కార్యనిర్వాహక సభ్యులు తాలుక అడ్వైజర్ లింబ ఆష్టపు నరేష్, గోంద్ర



సాగర్, చోండి రాజేశ్వర్, సందుల శంకర్, దిలావర్‌పూర్ మండల మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్దె అనిల్, దనె రవి, నడుకుడ సుఖేష్, పసుల పవన్, ఉద్గిరి సాయినాథ్, కుంట శ్రీనివాస్, పాల్దె ముత్యం, అలూరి మల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా రిమ్స్ : సుహాసినిరెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిరుపేదలకు వైద్యం అందిచాల్సిన ఏకైక ప్రభుత్వ ఆస్పత్రి రిమ్స్ అని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి మండిపడ్డారు. రిమ్స్‌లోని ఓపీలో రోగులు బారులు తీరి ఉన్నారని తెలుసుకున్న ఆమె ఓపీ వార్డుతో పాటు పలు విభాగాలను సోమవారం సందర్శించారు. రోగులను, సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా అది కేవలం మాటలకే పరిమితమైందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే స్థోమత లేక రిమ్స్‌కి వస్తే ఇక్కడ సౌకర్యాలు లేవని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం కేంద్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తే, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకం జరగలేదన్నారు. ఎంఆర్ఐ మిషన్, మార్చ్ నెలలో మంజూరు అయిన ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని అన్నారు. అంబులెన్స్‌లు సరిపడా లేక పోవడంతో ప్రయివేట్ అంబులెన్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న వెంటనే స్పందించి ఆస్పత్రిలో సమస్యలు పరిష్కారం అయ్యేలా చూసి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- రిమ్స్‌ను సందర్శించిన గిరిజన సంఘం నాయకులు
- సాయంత్రం వరకు ఓపీ సేవలు కొనసాగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షా కాలంలో ఎక్కువగా సీజినల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. జిల్లాలో రోజురోజుకు జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ రిమ్స్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఓపి సేవల విభాగంలో ఆయన పేషేంట్స్‌తో మాట్లాడారు. ఉదయం నుంచి లైనులో నిలబడి ఉండటం 12గంటలకే ఓపీ సేవలు బంద్ చేయడంతో రోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఓపీ సేవలు సాయంత్రం వరకు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పీహెచ్‌సీలో డాక్టర్ పోస్టులను భర్తీ చేయలని అన్నారు. అలాగే డాక్టర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చాలి



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చాలని సర్పంచ్ మిర్యాల హరిత కోరారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30 మంది వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు సరిపడాలేరని వాపోయారు. ఉన్న కాస్త ఉపాధ్యాయుల నుంచి ఒకరిని డిప్యూటేషన్‌పై పక్క గ్రామానికి పంపించడం అధికారుల తీరు సరికాదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, తమ గ్రామ పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో ఆమె వెంట విద్య కమిటీ చైర్మెన్ రాచమల్ల భద్రయ్య, ప్రతాప్ రావు అన్నారు.

మానవత్వం చాటుకున్న యువత



నవతెలంగాణ-నార్నూర్

కుమార్ తండా వద్ద సంవత్సరం నుంచి భిక్షాటన చేస్తున్న వ్యక్తికి తాడిహత్నూర్ గ్రామ హిందూ వాహిని సేవా సంఘ్ సభ్యులు ఆసరా కల్పించి, మానవత్వం చాటుకున్నారు. భిక్షాటన చేస్తున్న వ్యక్తిని గమనించి వారు ఆదివారం సాయంత్రం ప్లాస్టిక్ కవర్‌తో తోగుడిసె కట్టించి, బట్టలు, చాప భోజనం పెట్టారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు. సభ్యులు శివాజీ పోష్లే, కేంద్రే సుదాం, నాగర్ ఘోజే హన్మంత్, చొలే కృష్ణ, కేంద్రే రాహుల్, ముండే బాలకృష్ణ ఉన్నారు.

నేడు మోకుదెబ్బ జిల్లా మహసభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 18న జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా 10వ మహాసభను ఆదిలాబాద్‌లోని మాల సంక్షేమ సంఘం భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమర వేణి నర్సాగౌడ్‌తో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల గౌడ కులస్తులు, గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

కుటుంబ పాలనను అంతమొందించాలి



నవతెలంగాణ-కుభీర్

వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ గడపగడపకు మోహన్‌రావు పటేల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రంగశీవిని, రంగశివునితండా, చాత, చాత తండా గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోట్లాడి తెచ్చిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రజల బ్రతుకులు మరలేవని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను బీఆర్ఎస్‌ను అంతం చేసేందుకు ముధోల్ నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణలో మాత్రం వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. దీంతో గ్రామంలో గడప గడపకు తిరుగుతూ గ్రామ ప్రజలకు యువకులకు రైతులకు మోడీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట పడిపెల్లి గంగాధర్, జాదవ్ పండిట్ భోజన్న, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామ మల మహానాడు నాయకుడు వోలోపు విష్ణు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా సోమవారం మాల మహానాడు నాయకులు నివాళులు అర్పించారు. మరణించిన విష్ణు కుటుంబానికి 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విష్ణు లేడనే ఆలోచన కూడా బాధను కలిగిస్తుందన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే అతను లేకపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ విధానాలు రైతులకు వ్యతిరేకం

నవతెలంగాణ-దండేపల్లి



కాంగ్రెస్ రైతులకు పూర్తిగా వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనమని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని రెబ్బెనపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రేవంత్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ అవసరమా? అని అర్థరహిత వాఖ్యలు చేశారని, దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఎంత చేసిన తక్కువేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రైతులకు వ్యతిరేకంగా ఓటు వేసినట్లేనని అన్నారు.

వరకట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని లేండిగూడ గ్రామానికి చెందిన ఆదె అంజలి(18) సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గౌత్రె సుమిత్ర-బాలాజీ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె ఆదె అంజలి అదే గ్రామానికి చెందిన శంకర్‌ను ఇష్టపడి మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. కుమార్తె పుట్టిన తర్వాత భర్త ఆదె శంకర్, మామ ఆదె రంగయ్య, అత్త ఆదె తానుబాయి, మరిది ఆదె సోమయ్య అదనపు కట్నం కింద రూ.లక్ష, వ్యవసాయ భూమి తీసుకురావాలని తరుచూ మానసికంగా, శారీరకంగా వేధించేవారు. అత్తింటి వేధింపులు భరించలేక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకుంది. మృతురాలి తల్లి సుమిత్ర ఫిర్యాదు మేరకు భర్త ఆదె శంకర్, మామ రంగయ్య, అత్త తానుబాయి, మరిది సోమయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎంపీపీ వసతిగృహం సందర్శన



నవతెలంగాణ-కోటపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఎంపీపీ మంత్రి సురేఖ సోమవారం సందర్శించారు. వసతి గృహంలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. వర్షాలకు భవనం పెచ్చులు లూడి విద్యార్థులపై పడుతున్నాయన్నారు. 130 మంది విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు, కలెక్టర్‌కు తెలియజేశామని, అదనపు గదులు త్వరలోనే నిర్మిస్తామని పేర్కొన్నారని తెలిపారు.

గుంతకు సర్పంచ్ మరమ్మత్తులు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని లొద్దిగూడ గ్రామ పంచాయతీ సమీపంలో వంతెన పక్కన పడిన గుంతను సర్పంచ్ కొర్కటే దేవ్‌రావు పూడ్చివేయించాడు. సవాతి, డాబా, అంతాపూర్, కొలాంగూడ తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు భయపడుతూ ప్రయాణం చేస్తున్నారు. ప్రజలు గుంత విషయం దృష్టికి తీసుకురావడంతో సోమవారం మరమ్మత్తు పనులు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. మరమ్మత్తులు చేసిన సర్పంచ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు బాగు చేయించిన ఎస్ఐ



నవతెలంగాణ-కోటపల్లి

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నక్కలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో గొర్రెగుట్ట వాగుపై వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించి పోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్, నక్కలపల్లి సర్పంచ్ సాయంతో సోమవారం రోడ్డును బాగు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. ఎస్ఐ ప్రజా సేవకు మండల ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వర్షాకాలంలో వాగులు, వంకలు దాటొద్దన్నారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని తెలిపారు. యువత సరైన మార్గంలో నడవాలన్నారు.

ఉపరితల గని పని ప్రదేశాలను పరిశీలించిన డైరెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని పని ప్రదేశాలను సోమవారం డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు క్వారీలో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటిని పంపుల ద్వారా ఎప్పటికప్పుడు బయటికి పంపిస్తూ ఉండాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, ఓబి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి తగిన ప్రణాళికలు వేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఓబి కాంట్రాక్టు జీవీర్ ప్రతినిధులకు త్వరగా ఓబి వెలికితీత పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, ఇన్‌చార్జి గని మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

బీఎస్పీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఎస్పీ ముఖ్య కార్యకర్తలను కలిసి మాట్లాడారు. గ్రామస్థాయిలో బీఎస్పీ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, కనక ప్రభాకర్, మిలింద్, అంబదాస్, బాల సాహేబ్, ప్రశాంత్, వెంకటస్వామి పాల్గొన్నారు.

12వ రోజూ కొనసాగిన జీపీ కార్మికుల నిరసనలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు 11రోజులుగా సమ్మె చేస్తున్నారు. సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్య తీసుకోవాలని కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, మున్సిపాలిటీ కార్మికుల మాదిరి రూ.18వేల వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడికి రూ.10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మికులు రాజు, సమ్మయ్య, శంకర్, మహేష్, సాబీర్, నగేష్, విలాస్, కైలాస్, యమునాబాయి, పద్మ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మద్దతు

తిర్యాణి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం గ్రామపంచాయతీ కార్మికులు అలుపెరుగని పోరాటం చేసి కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుద్దాల తిరుపతి, సీపీఐ మండల కార్యదర్శి రంగు లచ్చుగౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సింగం మొగిలిగౌడ్, నాయకులు శంకర్, మధుకర్, జంగ్, మారుతి పాల్గొన్నారు.

వేమనపల్లి : పంచాయతీ కార్మికులకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కార్మికులు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని చెప్పారు. మోడీ స్వచ్ఛభారత్ కేసీఆర్ పచ్చదనం పరిశుభ్రత పిలుపును చిత్తశుద్ధితో అమలు చేశారని చెప్పారు. గ్రామీణ ప్రజల జీవన విధానంలో ముఖ్య భూమిక పోషిస్తున్న పంచాయతీ సిబ్బంది పట్ల కనీస కనికరం లేకుండా ప్రభుత్వాలు వ్యవహరించడం తగదన్నారు. ఎన్నికలకు ముందు పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని సీఎం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు జాడి మహేష్, ఉపాధ్యక్షులు చప్పిడే తిరుపతి, కార్యదర్శి ఇలుగురాళ్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఎక్బార్, కోశాధికారి డోల రాజబాబు పాల్గొన్నారు.

జన్నారం : పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, ఎంపీటీసీ దాముక కరుణాకర్, పట్టణ అధ్యక్షులు దుమల్ల రమేష్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఇందయ్య, సీనియర్ నాయకులు గంగన్న, బొట్ల భాగ్యరావ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, దుమల్ల ప్రవీణ్, పవన్ ఉన్నారు.

వాంకిడి : గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు గొడిసెల అశోక్ మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేయడంతో గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హాజీపూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ కరోనా సమయంలో కార్మికులు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. 12 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ కేవలం రూ.8వేల జీతం ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఒడ్డె రాజమౌళి, ఎంపీటీసీలు ఒడ్డె బాలరాజు, డేగ బాపు, పెద్దంపేట సర్పంచు పొట్టాల సుమలత-శ్రీశైలంగౌడ్, నాయకులు నాయికిని సురేందర్, మల్యాల రాజ్‌కుమారు, జగన్‌రెడ్డి, నర్సింగరావు పాల్గొన్నారు.

కెరమెరి : సమస్యల పరిష్కారానికి జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం పచ్చి గడ్డి తింటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు మాట్లాడారు. ప్రభుత్వం జీపీ కార్మికులను చిన్నచూపు చూడడం సరైందికాదన్నారు. 12రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. జీపీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వ వైఖరి ప్రకటించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు రాందాస్, నరేష్, సంతోష్, రవి, మల్లేష్ పాల్గొన్నారు.

రెబ్బెన : పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా సోమవారం ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత లేకుండా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశమున్నందున ప్రభుత్వం వెంటనే జేఏసీని పిలిపించి సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగవెల్లి సుధాకర్, వెంకటేశ్, రాచకొండ రమేష్, శంకర్, శ్రీనివాస్, బాబాజీ, సత్యనారాయణ, దేవాజీ, లక్ష్మి పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం వంటావార్పు చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులు విలాస్, వెంకటి, శ్యామ్‌రావు, పోశన్న, మల్లన్న పాల్గొన్నారు.

కాసిపేట : పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని పంచాయతీ కార్మికులు తేల్చి చెప్పారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నామని, ఎటువంటి సౌకర్యాలు లేవని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు దాసరి రాజయ్య, శ్యామ్, కటుక దీపక్, అట్ల మల్లేష్, వెంకటేష్, బోయిని లక్ష్మణ్, కరీం, విజయ్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.







బినామీ ఓనర్ల కక్ష సాధింపు చర్యలు

నవతెలంగాణ-నస్పూర్



బినామీ ఓనర్ల కక్ష సాధింపు చర్యలకు కన్వియన్స్ డ్రైవర్లు బలి అవుతున్నారని, డ్రైవర్లకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని ఎస్సీకేఎస్ (సీఐటీయూ)బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కన్వియన్స్ డ్రైవర్ శివకుమార్ ఎలాంటి కారణాలు లేకుండా నిర్లక్షణంగా విధులనుండి తొలగించడం జరిగిందని, తొలగించిన కార్మికుని వీధిలోకి తీసుకోవాలని సోమవారం శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఎస్ఓ టూ జీఎం కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కన్వియన్స్ డ్రైవర్ల పనికి ఏలాంటి భద్రత లేకుండా పోతుందని, ఓనర్లు ఇస్టానుసారంగా వివరిస్తున్నారని, ఈ పద్దతి శ్రీరాంపూర్ డివిజన్లో చాలా పెద్ద ఎత్తున కొనసాగుతుందన్నారు. ఇంతకు ముందు ఎండి హుస్సేన్ అనే కార్మికుని కూడా నిర్లక్షణంగా విధులకు దూరం చేసి, తనను, తన కుటుంబాన్ని రోడ్డుపాలు చేశారని అన్నారు. అలాగే ఇప్పుడు శివకుమార్ ను కూడా ఏలాంటి కారణాలు చూపించకుండా, అంతకుముందు పోరాటంలో పాల్గొన్నాడని ఒక్క కారణం చేత బినామీ ఓనర్లు అందరూ కక్ష సాధింపు చర్యలో భాగంగా తనను విధుల నుండి తీసేయడం జరిగిందన్నారు. 29 నెలలుగా ఒకే అధికారి దగ్గర డ్రైవర్గా చేస్తున్న ఆ యూజర్ సైతం బినామీ ఓనర్ తో మాట్లాడిన ప్రయోజనం లేకుండా పోతుందని,ఎస్ ఓ 2 జీఎం, జీఎం సైతం ఏం చేయలేము అంటే ఈ కార్మికులకు న్యాయం చేసేది ఎవరని ప్రశ్నించారు. ఈ కాంట్రాక్ట్ కన్వియన్స్ డ్రైవర్లందరికి వీటిసి, మెడికల్ చేయించిన దానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని విమర్శించారు. వెంటనే తొలగించిన కన్వియన్స్ డ్రైవర్ను వీధిలోకి తీసుకోకపోతే, పెద్ద ఎత్తున పోరాటానికి ముందుకు వస్తామని, జరగబోయే పోరాటానికి పూర్తి బాధ్యత కూడా సింగరేణి అధికారులే వహించాల్సి వస్తుందని తెలియజేశారు.

జేసిఐ అధ్యక్షునికి విశిష్ట ప్రతిభ రత్న పురస్కారం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఈ నెల 16న రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సర్వే జనా సుఖినో భవంతు నిర్వహించిన 6వ వార్షికోత్సవ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి విశిష్ట ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. జేసిఐ అధ్యక్షులు రాజు అరుమూళ్ల విశిష్ట ప్రతిభ రత్న పురస్కార అవార్డ్ అందుకున్నారు. ఈ అవార్డును హైకోర్టు రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ చంద్రకుమార్, మందడి కృష్ణారెడ్డి(జాతీయ వినియోగదారుల మండలి), దైవజ్ఞ శర్మ (సరస్వతి ఉపసాకులు) డాక్టర్, ఎస్.పి భారతి కేంద్ర సంగీత నాటక అకాడమి మెంబెర్, న్యూఢిల్లీ), పెంటపాటి కృష్ణాది శేషు (కేంద్ర ఫిలిం సెన్సారా బోర్డ్ మెంబెర్), సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఈఎస్ సూర్య నారాయణ, సూర్యతేజ సుబ్రాన్తే టీవీ కొరియోగ్రాఫర్ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సేవలు గుర్తించి ఎంపిక చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బెండర సమీపంలో ఉన్న ఆదర్శ డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని బీసీ యువజన సంఘం నాయకుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదర్శ కళాశాలకు వెళ్లడానికి రోడ్డు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో విద్యార్థులు బురదలో జారుతూ కళాశాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. విద్యార్థులకు కావలసిన తాగునీటి సౌకర్యం కూడా లేదన్నారు. కళాశాలకు ఆటస్థలం ఉన్నప్పటికీ అది ఎగుడు దిగుడుగా ఉండేసరికి ఉపయోగంలో లేకుండా పోతుందన్నారు. చుట్టూ కాంపౌండ్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు వెంటనే కళాశాలలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు సైదం నాగరాజు, బొట్టుపల్లి ప్రశాంత్, తరుణ్ పాల్గొన్నారు.

వాంకిడి సమస్యలు పరిష్కరించాలని..

వాంకిడి మండల కేంద్రంలోని పలు సమస్యలు పరిష్కరించాలంటూ మండల దళిత సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాంకిడి మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో డాక్టర్ బాబు జాగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాల్ స్థలం దగ్గర భవనం నిర్మాణానికి, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

చెట్లు నరికితే కఠిన చర్యలు

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో చెట్లను నరకడం నిషేధమని, నరికితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్, లక్షెట్టిపేట సిఐ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ హస్టల్ తండా జీపి పాలగోరి కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కంపార్ట్మెంట్ నెంబర్ 294లో కొంతమంది గిరిజనులు గత సంవత్సరం నుంచి చెట్లను కొట్టి పోడు చేసుకుంటున్న కారణంగా వారికి సిఐ, జన్నారం ఎస్సై సతీష్, ఫారెస్ట్ సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కంపార్ట్మెంట్లో ఉన్న భూమి అటవీ శాఖకు చెందినదేనని, అక్కడ చెట్లు కొట్టి, పోడు చేసుకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఆ భూమి విషయంలో



ఎలాంటి అనుమానాలు ఉన్న చట్టపరంగా వెళ్లాలని, ఇలా అక్రమంగా చెట్లను కొట్టి సాగు చేసుకోవడం తగదన్నారు. అటవీ శాఖ అధికారులకు, పోలీసులకు సహకరించాలని ఆ గ్రామస్తులకు సూచించారు. అటవీ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని సల్పాలవాగు సమీపంలోని రహదారిపై ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న సంఘటనలో దేవాపూర్ గ్రామానికి చెందిన బైరి నరేశ్(33) మృతి చెందాడు. తమ్ముడు సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం..బైరి నరేశ్, తమ్ముడు సురేశ్‌తో కలిసి సల్పలవాగు నుంచి యాపల్ వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా కుర్సింగ మహేశ్ బైక్‌పై వస్తూ ఢీ కొనడంతో నరేశ్, సురేశకు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా నరేశ్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. నరేశ్ మృతితో దేవాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లు అవసరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పర్యావరణ పరిరక్షణకు చెట్లు అవసరమని ఆసిఫాబాద్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా(తారిక్) అన్నారు. మండలంలోని జనకాపూర్‌లో గల అనాథ శరణాలయం ఆవరణలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. నాటిన మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇది ఎంతగానో తోడ్పడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పుల్లూరి శంకర్, జెడ్పీ కోట వెంకన్న, డైరెక్టర్స్ రమణరెడ్డి, నాంపల్లి శంకర్, బుర్స పోచయ్య, కోశాధికారి సంజయ్ కుమార్, వార్డెన్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 18 జులై 2023

కొనసాగుతున్న సమీకృత కలెక్టరేట్ పనులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ పట్టణంలో న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీ అనుకొని 18 ఎకరాల్లో రూ.55కోట్లతో చేపడుతున్నటువంటి నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయం పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్, అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకుంటూ పలు సూచనలు తెలియజేశారు. ఆదిలాబాద్ ప్రజానీకానికి పరిపాలన పరంగా సులభంతరం చేస్తు, ప్రజలకు సమస్యలు ఏర్పడకుండా ఒకే చోట సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని అన్నారు.

మహిళలకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



శ్రీరామకృష్ణ పరమహంస ధర్మపత్ని శ్రీ శారద మాతా జీవిత చరిత్రపై మహిళలకు ఆదిలాబాద్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చౌక్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఈ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షకు శిశుమందిర్, సీబీఆర్ పాఠశాలల ఉపాధ్యాయురాళ్లు, ఇతర మహిళలు హాజరయ్యారు. సేవా సమితి ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సభ్యులు లంక హన్మాండ్లు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు



నవతెలంగాణ-ముథోల్

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు బోల్గం నర్సగౌడ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎక్కువ శాతం టికెట్లు కేటాయిస్తామని అనడంతో, బీసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా ముథోల్ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వాలని కోరుతూ ముథోల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్సగౌడ్ రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో భేటి అయ్యారు. కాగా ఈ విషయం సోమవారం బీఆర్ఎస్ నాయకుడు రేవంత్‌రెడ్డిని కలిసి విషయం నియోజక వర్గంలో వైరల్‌గా మారింది. ఆయన వెంట నాయకులు సాయిబాబా, సాయరెడ్డి, లక్ష్మణ్, విశ్వనాథ్ పటేల్, సత్యం ఉన్నారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బోథ్ డివిజన్ ఉద్యమానికి పురుడు పోస్తాం

నవతెలంగాణ-బోథ్

వెనుకబడుతున్న బోథ్ నియోజకవర్గ అస్తిత్వం ఆత్మగౌరవం అభివృద్ధి కోసం ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం కోసం సోమవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలోని రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్ష రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేంతవరకు నిరంతర కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ తమ డిమాండ్లు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అన్నారు. డీఎస్పీ కార్యాలయం, రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాన్ని స్థానికంగానే ఏర్పాటు చేయాలని అన్నారు. డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలి తరలిపోయిన కార్యాలయాన్ని తిరిగి రప్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని అలాగే రెవెన్యూ డివిజనల్ ఏర్పాటు అయ్యేంత వరకు అందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు మొదటి రోజు రిలే నిరాహార దీక్షలో పసుల చంటి, సల్ల రవి, సుమేర్ పాషా, జక్కుల వెంకటేష్, అనిల్ మాసం, లింగంపల్లి నరేష్, అజర్ ఖాన్, షేక్ అబుద్, షేక్ షాబీర్ తూము సూర్యం, బత్తుల రమేష్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పేందుకు నిరాకరించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మావల మండల కేంద్రంలోని పద్మనాయక గార్డెన్‌లో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హజరయ్యారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పేందుకు నిరాకరించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి. మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, మాజీ ఎంపీపీ చందాల ఈశ్వరిరాజన్న, బీఆర్ఎస్ నాయకులు దోగ్గలి ప్రమీల రాజేశ్వర్, గోవర్ధన్, కార్యకర్తలు, మావల బట్టిసవర్గాం, వాఘాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అడహక్ కమిటీ ఎన్నికకు ఓటరు నమోదు

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్‌లోని ఆశోక బుద్ధ విహార్‌లో ఈనెల 30న అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా కమిటి ఎన్నుకకు అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం అడాక్ కమిటీ అధ్యక్షులు రగునాథ్ పవర్, కమిటీ సభ్యులు శైలందర్ వాగ్మారే, దయానంద్ కాంబ్లే, రవి జబడే, గంగారాం బోరెకర్, రవి జీవినే, సమక్షంలో దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్‌కు, కోశాధికారి దయానంద్ కాంబ్లెకు, రూ.100 రుసుము చెల్లించి, ఓటు రసీదును తీసుకున్నారు. ఉపసక, ఉపాసికులు త్వరగా సభ్యత్వం తీసుకొని ఓటు హాక్కు వినియోగించుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కోరుతూ సోమవారం తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పది డిమాండ్‌ల తో ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎజాజ్ అహ్మద్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇఫ్తేఖార్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అక్బర్ ఖాన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ఎ.రషీద్, సయ్యద్ జాహిద్ హష్మీ, ఖానాపూర్ ఫెడరేషన్ నాయకులు, జిల్లా సంయుక్త కార్యదర్శి మహమ్మద్ ముజీబుద్దీన్, షేక్ ఖైసర్ అహ్మద్, పర్వేజ్, ఖైసర్ మొహియుద్దీన్ ఉన్నారు.

కార్మికుల నిరసనకు సీపీఐ మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులు 17 రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. ఇందులో భాగంగానే సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల నిరసనకు సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కార్మికులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, రమేష్, నర్సింగారావు, కార్మికులు ఉన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి
- కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, అన్ని గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్ షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సొసైటీల్లో ఏకరూప పరిపాలన అమలు చేయాలని అన్నారు. టీఎస్ఆర్ఈఐఎస్, ఎంజేపీటీ, బీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ విద్యాసంస్థల్లో బోధనా సమయాన్ని ఇతర సొసైటీల్లో మాదిరిగా ఉ. 9.00 నుండి సా. 4.30 వరకు ఉండే విధంగా మార్చాలన్నారు. పిట్ 2018కు అనుగుణంగా చేసిన రీ అలైన్మెంట్‌పై ఉపాధ్యాయుల గ్రీవెన్సెస్ అన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని కోర్టు వివాదాలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. అన్ని గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్ షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని సొసైటీల్లో ప్రిన్సిపాల్ 100శాతం, పీజీటీ పోస్టుల్లో 70శాతం ఇన్ సర్వీసు పదోన్నతుల కోటాగా నిర్ణయించాలని అన్నారు. అన్ని సొసైటీల్లో నెల మొదటి తేదినే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రమకు తగిన వేతనం ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకంటే అదనంగా అమలు చేయాలన్నారు. గురుకుల ఉపాధ్యాయులపై పనిభారం, మానసిక ఒత్తిడి తగ్గించాలన్నారు. ఇతర ఉపాధ్యాయులతో సమానంగా హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని అన్నారు. కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్ లను ప్రత్యేకంగా నియమించి ఉపాధ్యాయులను నైట్ డ్యూటీల నుండి మినహాయించాలని అన్నారు. ఆదివారం, పండుగ సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వీక్ ఆఫ్ వర్తింపజేయాలన్నారు. సొసైటీ మారిన, ప్రభుత్వ సర్వీస్ నుంచి సొసైటీకి వచ్చిన ఉపాధ్యాయులకు పే ప్రొటెక్షన్ వర్తింపజేయాలని అన్నారు. కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పే, 12 నెలల వేతనం ఇవ్వాలన్నారు. సీఆర్టీల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, 2007 లో రెగ్యులరైజ్ అయిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింజేయాలన్నారు. గెస్ట్, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు గురుకుల ఉపాధ్యాయుల నియామకాల్లో వెయిటేజి ఇవ్వాలన్నారు. బాలురు, బాలికల పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులకు కంబైన్డ్ సీనియారిటీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్లకు, స్టాఫ్ నర్స్ లకు ప్రమోషన్ చానల్ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు సూర్యకుమార్, జిల్లా కోశాధికారి కిష్టన్న, జిల్లా కార్యదర్శిలు శ్రీనివాస్, విలాస్, శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ విలాస్, వివిధ గురుకులాల కన్వీనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మల్ : గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్‌లు అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్ని సొసైటీలలో ఏకరూప పాలన అందించాలన్నారు. బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, హెల్త్ కార్డులు అందించాలని అన్నారు. పని భారం తగ్గించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని లేనిపక్షంలో ఆగస్టు 5న హైదరాబాద్‌లో మహాధర్నాకు పిలుపునిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బక్కన్న, లక్ష్మణ్, రాజేందర్, రమేష్, భూమన్న, గణపతి, అనిల్, జిల్లా వ్యాప్తంగా వివిధ గురుకులాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు 12 రోజుల నుంచి నిరవధికంగా సమ్మెను కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్ జాతీయ రహదారిపై కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. జీఓ నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15వేల 600, కారోబారి, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19వేల 600 వేతనం కల్పించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, కొలవక అశోక్, రాజేశ్వర్, భూమన్న, లక్ష్మీ, గంగయ్య, నారాయణ పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని సుంకిడి తెలంగాణ-మహారాష్ట్ర అంతర్ రాష్ట్ర రహదారిపై తాంసి, తలమడుగు మండలాలకు చెందిన గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. దీనికి బీజేపీ పార్టీ నాయకుడు సంతోష్‌రెడ్డి మద్దతు తెలిపారు. పారిశుధ్య కార్మికులు రాస్తారోకో నిర్వహించడంతో కిలోమీటర్ల మేరా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తాంసి, తలమడుగు మండలాల పోలీసులు ఎస్సై రామారావు, ఏఎస్ఐ సురేందర్ తన సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్మికులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా పారిశుధ్య కార్మికుల సమ్మె 12వ రోజుకు చేరుకుందనీ తెలిపారు. తాంసి, తలమడుగు మండలాలకు చెందిన పారిశుధ్య కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని అన్నారు. సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని అన్నారు.

దస్తురాబాద్ : రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు సమ్మెలో దిగి సోమవారం నాటి 12 రోజులు గడుస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులను చర్చలకు పిలిచి పరిష్కరించాలని అన్నారు. 11వ పీఆర్సీ జీఓ నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15వేల 600, డ్రైవర్‌లకు రూ.19వేల 500, కారోబారిలకు రూ.15వేల 600 ఇచ్చి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ పాల్గొన్నారు.

నార్నూర్ : పారిశుధ్య కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ జిల్లాపెల్లి నవీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికుల 12వ రోజు చేరిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు సాధించేంతవరకు ఎమ్మార్పీఎస్ వారికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సమ్మెకు 12 రోజులు గడిచిన కనీసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధకరమని అన్నారు. వెంటనే పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలనీ కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శ్రీకాంత్, దేవిదాస్, రవి, పారిశుధ్య కార్మికులు బాపురావు, బానయ్య, కొద్దు, సంతోష్, జ్ఞానేశ్వర్, జంగు ఉన్నారు.

సిరికొండ : జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, 24 అవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు విశ్వబోధి అన్నారు. సోమవారం జీపీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవదిక సమ్మె 12వ రోజుకు చేరుకుంది. వారికి సంఘీభావం తెలవడంతో పాటు, 24 అవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, వేతనాలను పెంచాలని కోరారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా కష్ట కాలంలో పని చేసిన కార్మికుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, మైనారిటీ చైర్మెన్ రంజాన్, రిమ్మ సర్పంచ్ అనిల్, 24 అవర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వెంకటేష్, సచిన్, తాతగత్, జ్ఞానేశ్వర్, రామ్ పాల్గొన్నారు.

నేరడిగొండ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత 12రోజులుగా గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెబాట పట్టారు. సోమవారం సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో కార్మికులు అందరూ వీధుల్లోని దుకాణాలలో భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు రాచకొండ పోశెట్టి, గజ్జల అశోక్, నాందేడపు రాజు, బి.హరిప్రసాద్, రామంచ రాజేశ్వర్, మెర్భన్, జాదవ్ బలరాం, ఉత్తం, విఠల్, కార్మికులందరూ పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 12వ రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆటో డ్రైవర్ల సంఘం మద్దతు తెలిపారు. ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం పంచాయతీ కార్మికులు బైంసా, నిజామాబాద్ రహదారిపై ధర్నా నిర్వహించారు. పోలీసులు సముదాయించడంతో పంచాయతీ కార్మికులు ధర్నాను విరమించారు. పంచాయతీ కార్మికులు దేవరావు, నగేష్, కిరణ్ లయాక్, దేవన్న, గంగాధర్ పాల్గొన్నారు.

భీమిని : పంచాయతీ కార్మికులు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. గత 12రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని అన్నారు. కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు డొబ్బల స్వామి, ఉపాధ్యక్షుడు అరికిల్ల రమేష్, ప్రధాన కార్యదర్శి జంగపెల్లి మహేష్, రమాదేవి, శంకర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంలోని నయబాది చౌరస్తా వద్ద సోమవారం ముథోల్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని రాస్తారోకో చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. సుమారు 25 మంది కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. 12 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి మా న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు శంకర్, భూమన్న, నర్సింగ్, సునీల్, విజయ్, రామబాయి, ఆకాష్, భుజంగ్, మహారతాన్ ఉన్నారు.

ఐక్యంగా ఉండి బహుజనుల రాజ్యానికి పోరాడుదాం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఐక్యంగా ఉండి బహుజనుల రాజ్యం కోసం పోరాడుదామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా డా. బాబా సాహెబ్, కుమురం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, బీఎస్పీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా వెళ్తూ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. వీరి సమ్మెకు పది రోజులు దాటినా తెలంగాణ సర్కార్ నోరు మెదపడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు తమ కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. పాదయాత్రగా ఆయన హీరాపూర్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి ఘన నివాళులర్పించారు. భూమి, భుక్తి కోసం అమరులైన ఆదివాసీ బిడ్డలకు జోహార్లు అర్పించారు. అనంతరం కేస్లాపూర్‌లోని నాగోబా గుడికి వెళ్లారు. నాగోబా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పూజారి ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక బీఎస్పీ నాయకులు పెందూర్ అంకుష్, సోయం రాందాస్, దళిత నాయకులు పరత్‌వాగ్ దత్త, అరికిల్ల అశోక్ ఉన్నారు.

ఉట్నూర్ : దేశంలో అణగారిన వర్గాలకు సామాజిక, సాంస్కృతిక దాస్య శృంఖలాల నుంచి విముక్తం చేసేందుకు తమ జీవితాలను ధారపోసిన గొప్ప మహనీయుల స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శ్యాంపూర్ లో మరాఠా పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్, మరాఠా సాహిత్య సామ్రాట్ అన్నభావు సాటే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహనీయులని వారి త్యాగాలను స్మరించుకున్నారు. మహనీయుల ఆశయసాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. వారి అడుగుజాడల్లో యువత నడిస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బన్సీలాల్ రాథోడ్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్, ఖానాపూర్ అధ్యక్షులు కే.రాజేష్, మహిళా కన్వీనర్ కాంపల్లి సంతోషి, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కాటం ప్రభాకర్, మండల అధ్యక్షులు వెంకటేష్ ఉన్నారు.

మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) బీఆర్ఎస్ నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజుల కింద నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా ఆయనపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూచాడి శ్రీహరిరావు విమర్శనా అస్త్రం సందిస్తూ, గణేష్ చక్రవర్తి మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాదాల వద్ద ఉంచాడని విలేఖరుల సమావేశంలో కించపరిచేలా మాట్లాడాడని అన్నారు. అందుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు శ్రీహరిరావుపై విరుచుకుపడ్డారు. ఆయన ఇంతకాలం బీఆర్ఎస్ పార్టీలోనే ఉండి అన్ని రకాల లబ్ధిని పొంది ఇప్పుడు కాంగ్రెస్ చెంతచేరి ఈ విధమైన అనుచిత వాక్యాలు చేయడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోడె రాజేశ్వర్, పాల్దే అనిల్, కొంద్రా రమేష్, దనే రవి, నిమ్మల చిన్నయ్య, ఒడ్నం కృష్ణ, కోడె నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజా రక్షణే పోలీసుల లక్ష్యం

నవతెలంగాణ-సారంగాపూర్



ప్రజా రక్షణే పోలీసుల లక్ష్యమని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి డీఎస్పీకి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని అన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. వారి వెంట నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు.

సిడాం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 20న ఉట్నూర్ మండలంలోని మత్తడి గ్రామంలో ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన దివంగత ఉద్యమ నాయకుడు సిడాం శంభు 5వ వర్ధంతిని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు పెందుర్ దాదిరావ్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలో ఆదివాసీ నాయకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిడాం శంభు ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని 1/70, పేసా అటవీ హక్కుల చట్టం అమలు కవ్వాల్ టైగర్ జోన్, ఓపెన్ కాస్ట్ మైనింగ్ మాఫియా ఎత్తివేయాలని ప్రజల పక్షాన పోరాటం చేశారని అన్నారు. వారి పోరాట స్ఫూర్తితో ఈరోజు హక్కులు వచ్చినాయని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి సభను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు పూసం బాధిరావు, మాడవి చంద్రహరి, దేవ్‌రావు, తుంరం సంతోష్, పెందోర్ సంతోష్, పెందోర్ మధు, కొట్నాక. శ్రీరామ్, మెస్రం బలుదేవ్, జైవంత్, భీంరావ్ ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని లంబాడి తండా, బాబేర గ్రామ సర్పంచ్ బాబుసింగ్ ఇటీవలే ఆపెండిక్స్ ఆపరేషన్ ఆయన విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ నాయకుడు అనిల్ జాదవ్ సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సర్పంచ్‌ను పరామర్శించిన వారిలో బోథ్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ జైతురాం, దేవేంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాశినాథ్, ఆనంద్ రావ్, చంద్రశేఖర్, బిక్క లక్ష్మణ్ ఉన్నారు.

సర్క్యులర్ ప్రకారం వేతనాలు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎంఈ సర్క్యులర్ ప్రకారం, కృష్ణ కన్స్ట్రక్షన్ చేపట్టిన అగ్రిమెంట్ ప్రకారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కృష్ణ కన్స్ట్రక్షన్ మేనేజ్మెంట్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎంఈ సర్క్యూలర్ ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ కార్మికులకు ఇవ్వకపోతే ఆగస్టు ఒకటి నుంచి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక న్యూకాలనీకి చెందిన నానుబాయి. గత రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బోథ్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు మీర్ ఇర్షద్ అలీ బాధితురాలికి తనవంతుగా మానవతా దృక్పథంతో రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఇంకా ఎవరైనా దాతలు ఉంటే నానుబాయిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోలంకి సత్యనారాయణ, తుకారాం, సోలంకి రమేష్, మాల్వే ప్రకాష్, సాయి, సుధాకర్, మహేందర్, గులాబ్ పాల్గొన్నారు.

హిమాన్షు జిల్లా పాఠశాలను దత్తత తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ మనువడు హిమాన్షు మా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం బాస్కర్ అన్నారు. మన ఊరు మన బడి ద్వారా పాఠశాలను అభివృద్ధి చేస్తామంటూ ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదని అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26వేల ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ, విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కోవ వేణుగోపాల్, ఆనంద్ ఉన్నారు.